"ఈ ఎండలు యీ మంటలు యీ దాహం ఈ చిరాకు ఈతాపం నుంచి రక్షించమంటున్నాను."

"ఇవి లేవు అనుకోవటమే దీని నుంచి రక్షణ."

"షటప్"

"షటప్ కాదు. 1982లో 128 డిగ్రీల వేడి వుంటుందనుకో - ఇప్పుడు 1972లో 115 డిగ్రీలో 118 డిగ్రీలో వుంది గనుక అప్పుడు నేను వుండను కదా అని ఆ ప్రభువుకి మోకాళ్ళమీద ఆని కృతజ్ఞతలు చెప్పుకోవాలి."

"1990లో అగ్గిపెట్టె రూపాయి వుంటుంది. కాబట్టి 1972లో సుఖంగా వున్నామని నమ్మమంటావు."

"అంతే- అంతే-"

"ఏవండీ కులాసా?"

"ఆహా అంతా కులాసా?"

"ఎండలెలా వున్నాయ్!"

"మామూలే"

"జాగ్రత్తగా వుండండి"

"హా ఏం జాగ్రత్తా -?"

"వీధిలో తిరక్కండి. ఇంట్లో వుండండి."

"ఇంట్లో వున్నవాళ్ళు మటుకు పోటంలా-"

"ఆసంగతి కాదు నేన్చెప్పేది?"

"... ... ... ..."

"మాట్లాడరేం?"

"... .... ... ...."

"ఎండ దెబ్బ కొట్టిందా!"

"... ... .... ..."

# నీళ్ళ కోసం నిప్పుల పాట

మురికి పేటలకు, కుళ్ళు కాలవలకు, దోమలకు పెంట కుప్పలకు బురద, పందులకు, పిచ్చి కుక్కలకు, గుడిసెలకు - గుప్తధనానికి, రంగు వేషాలకూ, రాజకీయాలకూ, దుర్గంధానికి కొండమీది దేవుళ్ళకూ - కొండ క్రింది రాక్షసులకూ, అల్ట్రామోడ్రన్ ఫామిలీస్‌కూ - అడుక్కుతినే అలగాజనానికీ, ముష్టివాళ్ళకూ - ముష్కరులకూ, దొంగలకూ, దోపిడీదారులకూ

త్రాగుబోతులకూ - తలకు మాసిన వాళ్ళకూ - గుండెకాయ లాంటి "విజయ వాడ" దాని పాపం పండినట్లు ఎర్రెర్రగా మండిపోతోంది.

వేడి వేడి, తలుపులు వేడి, తలపులు వేడి, గోడలు వేడి, ఎండలు తాకిన భూమి భూమంతా వేడి, బల్లలువేడి, కుర్చీలు వేడి, కట్టుకున్న బట్టలు వేడి. ముట్టుకుంటే కాగితాలు వేడి. నోట్లోంచి వచ్చే మాటలు కూడా వేడి, గాలి వేడి, నీరు వేడి, ఆకాశమంతా నిప్పుల దుప్పటీ కప్పుకున్నవేడి - బజార్లు వేడి, అరుగులువేడి - గుమ్మాలు వేడి - స్తంభాలు వేడి, మెట్లువేడి మేడలువేడి, రాత్రంతా వేడి - పగలంతా వేడి. స్తంభాలువేడి, చేతులుకాలు తున్నా ఆకుల్ని పట్టుకోలేనంత వేడి, కడుపులో కార్చిచ్చు బయట దావాలనం, ఆశయాలు కాలిపోతున్న వేడి, ఆశలు కరిగిపోతున్న వేడి.

పచ్చని చెట్లెండి పోయాయి. పరువుగల బ్రతుకు లెండిపోయాయి. చెరువు లెండి పోయాయి. చెరువుల్లాంటి సంసారాలెండి పోయాయి. నూతులెండి పోయాయి. నూతుల్లాంటి నోళ్ళెండి పోయాయి. పంపులెండిపోయాయి. పాలిచ్చే పశువుల పొదుగు లెండిపోయాయి. కాలువ లెండి పోయాయి. కన్నీళ్ళుండిపోయాయి. ఇంత జరిగినా కృష్ణవేణమ్మకు కోపం పోలేదు. కొండమీది కనక దుర్గమ్మకు కనికరం కలగలేదు. బెజవాడ పాపం ఎండిపోలేదు.

వ్యాసకాశిలాంటి బెజవాడ బలవంతుడికోపంలా భగవంతుడి శాపంలా మండిపోతోంది. హోమ గుండంలో బెజవాడ భగభగ మండి పోతున్నది. శివుడు మూడోకన్ను తెరిచినట్లు బెజవాడ తన మూడో కన్ను తెరిచింది.

మంటలు, చప్పుళ్ళు-హాహాకారాలు - ఏడ్పులు, కేకలు, చావులు అయ్యో అయ్యోలు.... కుయో మొర్రోలు... ఓర్నాయనోయ్ ఓరి బాబోయ్ అమ్మనాయనోయ్, అమ్మబాబోయ్‌లు, రామరామ హరేహరే హరేరామ హరేరామ పెంకులు ప్రేలుతున్నాయ్ వాసాలెగురుతున్నాయ్ గోడలు కూలుతున్నాయ్, తాటాకు లెగురుతున్నాయ్. పొగ పొగ నల్లపొగ. తెల్లపొగ నీలంపొగ. పొగలమధ్య అగ్నిహోత్రుని నాలికల్లా మంట. పాకలంటుకొన్నాయి. పెంకుటిళ్ళంటుకున్నాయ్ మిద్దెలంటుకున్నాయి. మేడలంటున్నాయి. గడ్డివాము లంటుకున్నాయి. పశువుల పాకలంటుకున్నాయి. పూరి గుడిసెలంటు కున్నాయి. ఒంగున్న వేపచెట్టంటుకుంది. నిలబడి నవ్వుతున్న కొబ్బరిచెట్టంటుకుంది. తల విరబోసుకున్న రాక్షసిలా ఎదిగిన చింతచెట్టంటుకుంది. చింతల పక్క నిమ్మచెట్లంటుకున్నాయి. చెట్లూ పుట్టా మనిషి-గొడ్డూ, గాదం, చెంబూ ముంతా తప్పెలా చాపచుట్టా, మంచం, బుట్టలూ తట్టలూ చీరలూ రవికలూ, చొక్కాలూ లాగులు, బనిన్లూ అండర్‌వేర్ స్వెట్టర్లూ, యూనిఫారాలూ, పుస్తకాలూ కాగితాలూ ఒహటేవిటి అన్నీ అంటుకున్నాయ్, ఆర్పటానికి నీళ్ళేవి?

నీళ్ళు...నీళ్ళు...ప్రాణానికి త్యాగం... తాగేందుకు... బయటి మంటలూ కడుపులో మంటలు ఆర్పేందుకు నీళ్ల, నీళ్ళు, మంచితనమూ, నీళ్ళూయివి రెండూ కరువే ఎప్పుడూ బెజవాడలో...నీళ్ళులేని ఫైరింజన్లు, టోపీలులేని పోలీసులు, అరికాళ్ళకు చెప్పుల్లేని ఆడాళ్ళూ

– పిల్లలూ, వూరిచుట్టూ ఆగ్రహంతో సెగలు పొగలూ కక్కుతున్నాయా అన్నట్లున్న కొండలు, నేలతల్లి దీర్ఘ నిశ్వాసంలా వేడిగాలి వడగాలి – నేలతల్లి కడుపు పగిలింది. బద్దలయిన భూమి, పగిలిన గోడలు, పగిలిపోతున్న ఇళ్ళ కప్పులు – కూలిపోతున్న బ్రతుకులు కాలిపోతున్న బ్రతుకులు – చల్లార్చటానికి నీళ్ళేవీ – కన్నీరింకిన నీళ్ళులేని కళ్ళు, గుడ్డ పేలికలు, పందుల పెంటలు, చెత్తాచెదారం, ఎర్రటి యిసుక, నల్లగా మండుతున్న మట్టి దిబ్బలు, ఎర్రెర్రగా సూర్యుడు, ఆకాశంలో వర్షించని మేఘాలు, భుగభుగలు – పగిలిన పగుళ్ళు పగబట్టిన రాత్రిళ్ళూ – కారుహారన్లు – బళ్ల కిరకిరలు కాళ్ళ అడుగుల చప్పుళ్ళు – కేకలు – ఈలలు – అరుపులు – పారాహుషార్ కేకలు – రోడ్లమీద చల్లారిన సంసారాలు – పాత గుడ్డల మూటలు – చింకి చేటలు – కుండలు – కుక్కి మంచాలు తడికలు – వెదుళ్ళు వాసాలు – నడుస్తున్న జీవచ్ఛవాలు –సోడాబుడ్లకీచు కీచు చప్పుళ్ళు – సైకిళ్ళు – రిక్షాలు – కార్లు – వీధుల్లో కుక్కలు, టెలిఫోను –టైపు మిషన్లు – హడావిడి హడావిడి, భగవంతుడికి చావు బాజాలు వాయిస్తున్నట్లుంది విజయవాడ. ఒరే, బాబూ, నాయనా, ఆపద్బాంధవా, ఒక్క వర్షం వూరంతా తడిసి పోయేలాగు, కాలిన కొంపలు, కాలినట్లున్న మనుషులు, కాలిపోయిన సంసారాలు చల్లబడేందుకు ఒక్కవర్షం. ఒక్కపూట, కురిపించు, కురిపించు, నేలతల్లి దుఃఖం తీరేలా ఒకటే వర్షం కురిపించు తండ్రీ కురిపించు. పసిపిల్లలు, పిల్లల తల్లులు, మగవాళ్ళు, కానివాళ్ళు అంతా సంతోషించేలా ఒకటే వాన. కవులు వర్ణించినట్లు మంచి గంధం పూతలు పెట్టుకుని కూర్చుందుకు వీల్లేకుండా వుందిరా నాయనా. పంచాంగాల్ని పిండినా ఒక్క బొట్టు నీరు రాలటంలేదు – ఎన్ని సుప్రభాతాలు, ప్రార్థనలు, భజనలు చేసినా మేం కార్చే కన్నీళ్ళే తప్ప నువ్వు కురిపించే చన్నీళ్ళు లేవు. ఒక్క వర్షం కురిస్తే – ఒక్క హరివిల్లు విరిస్తే – చాల్రాబాబూ నాయనా తండ్రీ, బెజవాడ చేసిన పాపాలన్నీ కొట్టుకు పోయేలాటి వర్షం ఒక్కటంటే ఒక్కటి భూమ్యాకాశాలను గొలుసుల్తో బంధించినట్లు కురిస్తే చాలు చాలు. మరింకేమీ నిన్నడిగేదిలేదు. జనమేజయుని సర్పయాగంలా వుంది. హనుమంతుడు కాల్చిన లంకలా వుంది. మండుతున్న కొరకంచులా వుంది. శవం వెళ్ళిన కొంపలా, ఆరని కుంపటిలా, మహాశ్మశానంలా వున్న విజయవాడమీద కరుణించు, కరుణించూ కైలాస వాసా శంభో...కరుణించూ కరుణించూ.

(తిరిపెమున కిద్దరాండ్రా, పరమేశా గంగ విడుము పార్వతి చాలున్–)

# వరమ్మ మొగుడు

"లెండు – ప్రపంచ భార్యలారా ఏకం కండు" అని మావారు వేళాకోళం చేస్తూ వుండేవారు ఢిల్లీలో వున్నప్పుడు మా లేడీస్ అంతా ఒకచోట చేరి పిండిరుబ్బింగు, హస్కు, ఒడియాలు. అప్పడాలు, పచ్చళ్ళు పెట్టడం యిత్యాది విషయాలపై సమావేశాలు జరిపినప్పుడు...కొత్త